www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 మార్చి 2025
5
వైఎస్ఆర్



జిజిహెచ్ డిడి శ్రీనివాసులను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప రిమ్స్ జిజిహెచ్‌లో ఆప్సన్, శానిటేషన్‌ను ఒకరకంగా, నచ్చిన వారిని మరో రకంగా చూస్తున్న డిడి శ్రీనివాసులను సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, సుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా గతంలో ఆప్సన్ ఉద్యోగులను వేధించడం, నచ్చిన వారికి ఒకరకంగా, శానిటేషన్ వారికి ఒకరకంగా, మరొకరికి ఒకరకంగా వ్యత్యాసం చూపుతూ ఇబ్బంది పెట్టె వారని తెలిపారు. ఒక ఉద్యోగికి అనారోగ్యరీత్యా రెండు నెలలు రాకపోతే జీతం పెట్టడంలో అంతర్యం ఏమిటని పేర్కొన్నారు. మిగతా ఉద్యోగులు పర్మిషన్ తీసుకున్న జీతాలు కట్ చేయడం, ఇబ్బంది పెట్టడం చేస్తున్నారని తెలిపారు. నన్ను ఏం చేసుకుంటారనే ధైర్యంతో డిడి బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. వీటిపైన విచారణ చేసి డిడి శ్రీనివాసులు పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సోమవారం జాయింట్ కలెక్టర్‌కు రాతపూర్వకంగా అందజేస్తామని పేర్కొన్నారు.

తూతూమంత్రంగా స్టాండింగ్ కమిటీ సమావేశం

హౌసింగ్ పిఎం 2.0 ఆ'ధనం'పై అవగాహన
మామిడి పూత పరిరక్షణ చర్యలేవీ
నీటిఎద్దడిపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు తూతూమంత్రంగా సాగాయి. జిల్లా పరిషత్ చైర్మన్, వైస్‌చైర్మన్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా పరిషత్, డిఆర్‌సి సభాభవన సమావేశాల్లో నిర్వహించారు. స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో జిల్లాలోని అభివృద్ధి పనుల పురోగతి, వాటి పద్దుల వ్యయం, ఇందులోని సాదకబాధకాలను చర్చించాల్సి ఉంది. కానీ జిల్లా పరిషత్ సమావేశాల తరహాలో ప్రజల సమస్యల ప్రస్తావన పరిమితం కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా పరిషత్ సభ్యులు సైతం స్టాండింగ్ కమిటీ సమావేశాలకు అనుగుణంగా ప్రిపేర్ రావడం లేదనే విమర్శ వినిపిస్తోంది. ఈ సందర్భంగా వేంపల్లి, పోరుమామిళ్ల జెడ్‌పిటిసిలు రవికుమార్‌రెడ్డి, ముత్యాల చెన్నయ్య మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల్లో పక్కాగృహాల దరఖాస్తుల అప్‌లోడ్‌పై అధికార టిడిపి నాయకుల అత్యుత్సాహం చెలాయిస్తున్నారని విమర్శించారు. దీనికి హౌసింగ్ పీడీ స్పందించి పేదలందరికీ పక్కాగృహాల నిర్మించాలనే ఉద్దేశంతో కూడిన పథకమని, అర్హులైన ప్రతిఒక్కరికీ పక్కాగృహాలు కేటాయిస్తామని తెలిపారు. ఇప్పటివరకు రేషన్‌కార్డు ఆధారంగా దరఖాస్తులు చేసుకునే వారమని, తాజాగా కొత్తగా పెళ్లి చేసుకున్న జంటలు సైతం ఆదాయ ధ్రువీకరణపత్రం ఆధారంగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని వివరించారు. దీనికితోడు హౌసింగ్ పిఎం 2.0 పథకం కింద ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.70 వేలు, బిసిలకు రూ.50 వేల చొప్పున అదనపు కేటాయింపులు చేశారని తెలిపారు. ప్రజాప్రతినిధులు ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చక్రాయపేట జెడ్‌పిటిసి శివ ప్రసాద్‌రెడ్డి స్పందించి మండలంలో నీటిఎద్దడి తీవ్రంగా ఉందని, నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కోవిడ్ అనంతరం జిల్లావ్యాప్తంగా మామిడి పూతకు ఫలం రావడం లేదని, అరకొరగా వచ్చిన పూత పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఖాజీపేటకు చెందిన జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లా కెసి కెనాల్ చివరి ఆయకట్టు వరకు సాగునీటిని సరఫరా చేయాలని కోరారు. నత్తనడక ఖాజీపేట - సుంకేశుల రహదారి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్టాండింగ్ కమిటీ సమావేశానికి పలువురు జడ్పీటిసిలు, జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన జడ్‌పిటిసిలు

క్యాంపు రాజకీయాలకు శ్రీకారం

- రేపటి నుంచి జడ్‌పిటిసిల తరలింపు!
- విందు సమావేశంలో నేతల దిశానిర్దేశం
- గెలుపే ధ్యేయంగా వ్యూహ రచన
- జడ్‌పి చైర్మన్‌గా రామగోవిందరెడ్డి గెలుపునకు కసరత్తు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. ఐదు రోజుల కింద రాష్ట్ర ఎన్నికల కమిషన్ జడ్‌పి చైర్మన్ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసింది. దీంతో వైసిపి జిల్లా నాయకత్వం అప్రమత్తమైంది. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 50 జడ్‌పిటిసి స్థానాల్లో 49 స్థానాల్లో వైసిపి గెలిచిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారం చేతులు మారడంతో ఆరు నుంచి ఎనిమిది మంది జడ్‌పిటిసిలు కూటమి గూటిలోకి వెళ్లడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 2024 డిసెంబర్‌లో తాడేపల్లి వైసిపి కార్యాలయంలో జడ్‌పి సమావేశంలో వైసిపి అధిష్టానం చైర్మన్ అభ్యర్థిగా బి.మఠం జడ్‌పిటిసి రామగోవిందరెడ్డి పేరును ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో టిడిపి నాయకత్వం సైతం చైర్మన్ బరి దిశగా పావులు కదపడం తెలిసిందే. కొంతమంది జడ్‌పిటిసిలకు ఫోన్ల ద్వారా సంప్రదింపులు చేసింది. జడ్‌పి పాలనా వ్యవధి రెండేళ్ల నుంచి ఏడాదిన్నరకు పడిపోయింది. దీంతో టిడిపి జడ్‌పి చైర్మన్ ఎన్నిక బరిపై ఆసక్తిని చూపని పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని దక్కించుకోవడంపై శుక్రవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కార్యాలయం 41 మంది జడ్‌పిటిసిలతో విందు సమావేశాన్ని నిర్వహించింది. ఈనెల 23న జిల్లా అధికార యంత్రాంగం నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా 41 మంది వైసిపి జడ్‌పిటిసిలను క్యాంపు పేరిట విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈనెల 27న నిర్వహించనున్న ఓటింగ్ సమయానికి జిల్లా పరిషత్ కార్యాలయానికి తరలించేలా వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. వైసిపి జడ్‌పిటిసిలందరికీ నాయకత్వం "మీరందరూ జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా బి.మఠం జడ్‌పిటిసి రామగోవిందరెడ్డిని ఏకగ్రీవంగా గెలిపించుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

నేటి నుంచి సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు

నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఈనెల 22 నుంచి సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు నగర కార్యదర్శి ఎ.రామమోహన్ తెలిపారు. శుక్రవారం పార్టీ నగర కమిటీ సమావేశం నగర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇంతవరకు సూపర్ సిక్స్ హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అమ్మ ఒడి, మహిళలకు నెలకు రూ.1500 నిరుద్యోగభృతి, తదితర పథకాలు ఇంకా అమలు కాలేదని చెప్పారు. నగరంలో సచివాలయ వ్యవస్థ ఉన్నా పేదల కాలనీలలో, మురికివాడలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రెయినేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విలీనమైన పంచాయతీల్లో మౌలిక వసతులు కార్పొరేషన్ పాలక యంత్రాంగం విస్మరించిందని చెప్పారు. డివిజన్ల వారీగా జరిగే ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు తమ సమస్యలను సిపిఎం ప్రతినిధి బృందం దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజా చైతన్య యాత్రలో ప్రజా సమస్యలను తెలుసుకుని రానున్న కాలంలో దశలవారీగా ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. సమావేశంలో నగర కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కుమార్ స్వామిరెడ్డి, జమీల వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, నాయకులు వెంకటసుబ్బయ్య, విజయ్, శివరాం, నరసింహ, సరిత పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్

సామాజిక చైతన్యమే లక్ష్యంగా ఉక్కు ఉద్యమం

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

కడప ఉక్కుపై సామాజిక చైతన్యమే లక్ష్యంగా సిపిఎం ఉద్యమం చేపడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన చట్టం షెడ్యూల్ 13లో కడప ఉక్కు పరిశ్రమను సెయిల్ ఆధ్వర్యంలో నిర్మిస్తామని పార్లమెంటులో రాష్ట్రపతి ఆమోదంతో లిఖితపూర్వకంగా తెలిపారని ఆయన గుర్తు చేశారు. దేశంలో నాటి ప్రతిపక్షం నేటి పాలకపక్షం బిజెపి దానికి రాతపూర్వకంగా అంగీకరించిందని తెలిపారు. అయినా ప్రయోజనం లేదు అన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు టిడిపి జనసేన, వైసిపి స్వార్థ రాజకీయాల కోసం కడప ఉక్కుపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని వారు విమర్శించారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు లిబర్టీ డిఫాల్ట్ ప్రయివేట్ కంపెనీలను తెచ్చి శంకుస్థాపనలు చేసిందని పేర్కొన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఎపి హై గ్రేడ్ స్టీల్ కార్పొరేషన్ ఏర్పాటు పేరుతో కడప జిల్లా ప్రజలను ఘోరంగా మోసం చేశారని ఆరోపించారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి అనువైన భూమి, నీరు, విద్యుత్ లయమ్ స్టోన్, నౌక, రైల్వే ,రోడ్డు ట్రాన్స్‌పోర్టు అందుబాటులో ఉన్నాయని తెలిపారు 95 శాతం అనుకూలమైన పరిస్థితి ఉందన్నారు. బిజెపి తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని పాలక ప్రతిపక్షాలు పోరాడకపోతే వారి పార్టీలను బిజెపి మింగేస్తుందని పేర్కొన్నారు. దేశంలోనే వివిధ రాష్ట్రాల్లో బిజెపి తన మిత్రపక్ష పార్టీలను మింగేసిన వైఖరి చూసి గుణపాఠం నేర్చుకోవాలని ఆయన హెచ్చరించారు. రాయలసీమ కరువు తీవ్రత ప్రాంతం యువతి ,యువకులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కావాలంటే సీమ నడిబొడ్డున కడప జిల్లాలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాడు విశాఖ ఉక్కు కోసం ప్రతిపక్షం తరిమెల నాగిరెడ్డి నాయకత్వంలో శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు రాజీనామాలు చేసి ప్రభుత్వ మెడలు వంచి సాధించారని గుర్తు తెచ్చారు. నేడు జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రాజీనామాలు చేసి కడప ఉక్కు పరిశ్రమ సెయిల్ ఆధ్వర్యంలో నిర్మాణానికి ఉద్యమ బాట పట్టాలని లేకుంటే రాయలసీమ ప్రజలు క్షమించరని వారు తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులరెడ్డి సిపిఎం సీనియర్ నాయకులు పెద్ద బయన్న డాక్టర్ తవ్వా సురేష్ శేఖర్ బాలసుబ్బయ్య రాములమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

'పది' పరీక్షకు 27,786 మంది హాజరు

ప్రజాశక్తి- కడప అర్బన్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. 161 పరీక్షా కేంద్రాలలో రెగ్యులర్ అభ్యర్థులు 27,924 మంది హాజరు కావాల్సి ఉండగా 27,786 మంది హాజరయ్యారు. 138 మంది గైర్హాజరయ్యారు. ప్రయివేటు విద్యార్థులు 13 మందికి గాను పదిమంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను 13 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 90 కేంద్రాలను, డిఇఒ షంషుద్దీన్ మూడు కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు.

కర్మయోగి పోర్టల్‌పై అవగాహన

ప్రజాశక్తి - కడప : ఎపి డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఐజిఒటి కర్మయోగి పోర్టల్‌పై శుక్రవారం ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిఆర్‌ఒ విశ్వేశ్వరనాయుడు, జిల్లా లముఖ్య ప్రణాళికాధికారి హజరతయ్య హాజరై మాట్లాడారు. అధికారుల భవిష్యత్‌ను పటిష్టం చేసే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రతి ఉద్యోగి, అధికారి సిఎఫ్‌ఎంఎస్ లింక్ చేసిన మొబైల్ నంబర్‌ను ఉపయోగించి లాగిన్ చేసుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్ హరనాథ్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత అప్పారి వెంకటస్వామి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ప్రజాశక్తి - కడప అర్బన్ : అప్పారి వెంకటస్వామి ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. యుటిఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన త్యాగశీలి అప్పారి వెంకటస్వామి అని తెలిపారు. చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాలకు తూట్లు పొడిచి ఉద్యమాన్ని వేర్పాటు వాదులు పక్కకు లాగే సమయంలో ఉపాధ్యాయ ఉద్యమాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలని సమైక్యతావాదులతో కలిసి నాదెళ్ల సీతారామాచారి అధ్యక్షులుగా 1974, ఆగష్టు 10 న కాకినాడలో యుటిఎఫ్ ను రిజిస్ట్రేషన్ చేయించి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ను స్థాపించారని చెప్పారు. కేడర్లు, స్థానిక, ప్రాంతాల విభేదాలను అధిగమించి రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉద్యమాలు నడిపారన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శి సి.వి.రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, శివ శంకర్, వీరనారాయణ, జమాల్ బాషా, సుబ్బారావు, రామకేశవ, ప్రకాష్ బాబు, విజయ్ కుమార్, శ్రీనివాసాచారి, బాబు పాల్గొన్నారు.

ఇఫ్తార్ ఇవ్వడం ఆనందదాయకం

ప్రజాశక్తి-కడప సిటీ : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలోని వారికి ఇఫ్తార్ విందు ఇవ్వటం ఆనందదాయకమని దూదేకుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఆయిల్ మిల్ ఓబులేసు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు వి.ఖాదరయ్య, సుభాన్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం ఎర్రముక్కపల్లిలోని దూదేకుల భవన్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందును ఉద్దేశించి ప్రసంగించారు. రోజా ఉన్న వారికి ఇఫ్తార్ ఇవ్వడం సంఘ సభ్యులకు సంతోషకరమని తెలిపారు. దీంతోపాటు టీచర్ అజ్మతుల్లా, రిటైర్డ్ ఫారెస్టర్ హుస్సేన్ సాబ్, వల్లూరు సిద్దు సాహెబ్ రైల్వే ఆధ్వర్యంలో చుట్టుపక్కల ఉన్న ఐదు మసీదులకు విందు భోజన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇందులోభాగంగా. సుమారు 150 మంది పైగా ఫ్రూట్ సలాడ్‌తో ఉపవాసం ముగించుకున్నారని చెప్పారు. అనంతరం నమాజ్ చేసుకుని ఇఫ్తార్ విందు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సద్దాంఅం హుస్సేన్, అరుణాచల హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ యూరాలజిస్ట్ కరీముల్లా, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ప్రిన్సిపల్, జడ్‌పి రిటైర్డు డిప్యూటీ సిఇఒ వెంకట ప్రసాద్, పిఎంఅంబాష , మస్తాన్ సాహెబ్ , రాయపాటి బాబు, మన్సూర్ అక్బర్, బాదుల్లా, ఓబులేసు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో దూదేకుల సంఘం నాయకులు

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 3 నుంచి కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో నిర్వహించబోయే పదవ తరగతి మూల్యంకన కేంద్రంలో వసతులు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా శాఖ విద్యాశాఖాధికారి షంషుద్దీన్‌కు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం డిఇఒను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున మూల్యాంకన కేంద్రంలో చలువ పందిర్లు, కూలర్లు, ఫ్యాన్లు తగినన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మంచినీటి వసతితోపాటు, మజ్జిగను కూడా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. మూల్యాంకన విధులు నిర్వహించిన వారికి జాప్యం లేకుండా పారితోషికాన్ని చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డిఇఒ మూల్యాంకన కేంద్రంలో వసతి సౌకర్యాలను కల్పించడంలో రాజీపడబోమన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. మూల్యాంకన విధుల పారితోషికాన్ని వెంటనే చెల్లించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపీనాథ్, వీరనారాయణ, సుబ్బారావు, అనిల్ కుమార్, రామకేశవ, జమాల్ బాషా, ప్రకాష్ బాబు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

డిడిఆర్‌ఎఫ్ఒ ధర్మరావుకు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉగాది పురస్కారాలు - 2025లో భాగంగా రాష్ట్ర పోలీసు, ఫైర్ సర్వీసు సేవా పతకాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వైఎస్ఆర్ కడప జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అధికారి ఐ.ధర్మారావుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారాన్ని ప్రకటించింది. 2023 సంవత్సరంలో కడప పట్టణంలోని మద్రాసు రోడ్డులో స్క్రాప్ ఓపెన్ యార్డులో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద సమయంలో చాకచక్యంగా ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్ నిర్వహించి యార్డుకు సమీపంలోని కార్ల షోరూమ్, అపార్టుమెంట్లను ప్రమాదానికి గురికాకుండా కాపాడినందుకు, పులివెందుల ప్రాంతంలో ఎన్ఎస్ఎల్. ఫ్యాక్టరీలో సంభవించిన అగ్నిప్రమాద సమయాల్లో ఎంతో నైపుణ్యంతో వ్యవహరించి ఫ్యాక్టరీని, మిషనరీని కాపాడినందుకు, ఇంకా పలు సంఘటనలో చాకచక్యంగా వ్యవహించినందుకు గుర్తింపుగా డిడిఆర్ఎఫ్ఒకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. తన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ సేవా పురస్కారం ఎంపికకు సహాయ సహకారాలు అందించిన కలెక్టర్ డా.శ్రీధర్, జెసి అదితి సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బి.ఫార్మసీ పూర్తిచేస్తే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - కడప అర్బన్ : బి. ఫార్మసీ పూర్తి చేసిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నిర్మల ఫార్మసీ కళాశాల చైర్మన్ బి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను అభ్యసించేటప్పుడు క్రమశిక్షణతో, శ్రద్ధతో ఉండాలని పేర్కొన్నారు. మంచి మార్కులు సాధించిన వారికి ఉద్యోగాలు వెంటనే వస్తాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యు. మోహన్‌కుమార్ మాట్లాడుతూ దేశ, విదేశాల్లో ఉత్తమ విద్యార్థులకు ప్రాధాన్యత ఉందని తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్‌ను సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

ఉచిత మజ్జిగ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కడప : మండే ఎండల్లో గుక్కెడు నీళ్లు కొండంత ఉపశమనం ఇస్తుందని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్. రమణ అన్నారు. కడప విద్యుత్ భవన్‌లో కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, మంచినీటి వితరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు జిల్లాలో పలుచోట్ల మజ్జిగ, మంచినీటి వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం నాయకులు, విద్యుత్ అధికారులు, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.


మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విద్యుత్ ఎస్ఇ

నైపుణ్యత ఆధారిత విద్యతో ఉద్యోగాలు

-వైవీయూ ఇన్‌ఛార్జి విసిగా ఆచార్య అల్లం శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం- 2020 కచ్చితంగా అమలు చేసి విద్యా నైపుణ్యతను అందించి ఉద్యోగాలు పొందేవారిగా కాకుండా ఇచ్చేవారిగా వైవీయూ విద్యార్థులను తయారు చేస్తామని ఇన్‌ఛార్జి విసి ఆచార్య అల్లం శ్రీనివా సరావు విశ్వాసం వ్యక్తం చేశారు. నెల్లూరు విక్రం సింహపురి విశ్వవిద్యాలయం విసిగా ఉన్న శ్రీనివాసరావు వైవీయూ ఇన్‌ఛార్జి విసిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్యపుత్తా పద్మ, వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి, ప్రొద్దుటూరు వైవీయూ వైఎస్ఆర్ ఇంజినీరింగు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, డీన్‌లు, బిఒఎస్ చైర్మన్లు, అన్ని శాఖల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, స్కాలర్లు విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం తనకు పరిచయం ఉందని, అందరినీ కలుపుకుని తన ప్రయత్నాలను ముమ్మరం చేసి అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లేలా విశ్వప్రయత్నాలు చేస్తానన్నారు. ఇక్కడంతా మారుమూల పల్లెల నుంచి వచ్చిన పేద విద్యార్థులు చదువుతున్నారని, వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దే బాధ్యత మనపై ఉందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయానికి విసిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులతో బేటీ అయ్యారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తన ఆలోచనలను తెలియజేసి సహకరించాలని కోరారు. పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్, డాక్టర్ మాదక్క, కొండవల్లి సుబ్బారావు, ముబీనా బేగం పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-చెన్నూరు : నగరంలోని కడప నగరం220 కె.వి.ఎస్ఎస్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా మండలంలో శనివారం ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఎఇ రామలింగారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దేశానికి యువత వెన్నముక

ప్రజాశక్తి- కడప అర్బన్

భారతదేశానికి యువత వెన్నెముక అని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వం కేంద్ర క్రీడా, యువజన వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో వికసిత్ భారత్ జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమం భాగంగా 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అనే అంశం పైన ఉపన్యాస పోటీలు కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ మాట్లాడుతూ భారతదేశంలో యువత శక్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. నెహ్రూ యువ కేంద్ర యూత్ ఆఫీసర్ మణికంఠ మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేసేది యువత అన్నారు. దేశం అభివృద్ధి సాధించాలంటే యువత వారి యొక్క శక్తి సామర్థ్యాలను వెలికి తీయాలని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ చంద్ర ఓబుల రెడ్డి మాట్లాడుతూ యువత ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం అలవర్చుకోవాలని అన్నారు. కడప, అన్నమయ్య జిల్లా పరిధిలోని యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రసంగాలను వినిపించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మూర్తి, వైవీయూ ఎన్ఎస్-ఎస్ కో-ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మెజిస్ట్రేట్

ఎంబార్కేషన్ పాయింట్ తొలగించడం సరికాదు

ప్రజాశక్తి - కడప

విజయవాడ నుంచి ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు ఉన్న ఎంబార్కేషన్ పాయింట్ సౌకర్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొలగించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. ఎంబార్కేషన్‌ను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం మత విద్వేషంతో ప్రత్యేకంగా విజయవాడ నుంచి బయలుదేరే హజ్ యాత్రికుల సౌకర్యాన్ని రద్దు చేశారని ఆరోపించారు. వెంటనే హజ్ యాత్రికులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది హజ్ కు వెళ్లే యాత్రికులు తక్కువగా ఉన్నారని, విమానయాన ఛార్జీలు ఎక్కువగా ఉన్నట్లు కారణాలుగా చూపి సౌకర్యాన్ని రద్దు చేయడం మత్తవిద్వేషానికి నిదర్శనమని విమర్శించారు.దీనికి ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మయాన రహమతుల్లా ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్‌బాష, కాంగ్రెస్ పార్టీ నేత హమీద్ పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కస్తూర్బాలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కాశినాయన : మండల పరిధిలోని వరికుంట్ల కస్తూరిబా పాఠశాలలో 2025 -26వ సంవత్సరానికి గాను ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోస దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నామని ఆ పాఠశాల ఎస్ఒ మెర్సీ రాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా 7,8,9,10, ఇంటర్ సెకండియర్ లో మిగిలి ఉన్న ఖాళీల కోసం బాలికల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు ఈనెల 22 నుండి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు ముఖ్యంగా బడి మానేసిన అనాథలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన పేద విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడదాం

ప్రజాశక్తి - బద్వేలు : డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటు పడుదామని ఎక్సైజ్ సిఐ పి. సీతారామిరెడ్డి పేర్కొన్నారు. డివైఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ముద్రించిన మాదక ద్రవ్యాల నివారణ పోస్టర్లను డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ ఆవరణంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయంలో సిఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు, మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళవద్దని, వాటికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. యువత ఇటువంటి వాటి మోజులో పడి చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో గంజాయి మత్తుపదార్థాల వంటి వాటిని అరికట్టడానికి పోలీస్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్లు ఉక్కు పాదం మోపాయని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ యువతను డ్రగ్స్ మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాల వైపు నుండి మంచి మార్గం వైపు నడపడం కోసం డివైఎఫ్ఐ యువజన సంఘం అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ గౌస్ బాష, హెడ్ కానిస్టేబుళ్లు నారాయణరెడ్డి, గురయ్య, డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, ఎస్.కె.ఆదిల్, రూరల్ అధ్యక్షులు ముడుమాల ఓబుల్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు యువరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అటవీ దినోత్సవం

ప్రజాశక్తి - కమలాపురంటౌన్

నెహ్రూ యువ కేంద్రం, మదర్‌థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ అటవీసంపద, సహజ వనరుల నిర్వహణ, సుస్థిరాభివృద్ధి గురించి వివరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి. సత్యనారాయణ రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ రమాకుమారి

భూ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - చాపాడు

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. గ్రామ సందర్శనలో భాగంగా శుక్రవారం ఆమె వెదురూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటిస్తున్నామన్నారు. సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు చూపుతున్నామన్నారు. రైతు నుంచి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, అవకాశం ఉన్న వాటికి వెంటనే న్యాయం చేస్తున్నామన్నారు. గ్రామాల్లో పర్యటించి ఏవైనా సమస్యలు ఉంటే వాటిని సంబంధిత అధికారులకు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, విఆర్ఒ పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో శ్లోకా పాఠశాల సమీపంలో నూతనంగా తాగునీటి బోరు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వనాథ్‌రెడ్డి కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, ఎస్సీ కాలనీ, రెడ్డయ్య కాలనీ, మారుతీ నగర్ కాలనీలో ఉన్న నీటి బోర్లల్లో నీరు తగ్గడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. సమస్యను టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, బోర్లు వేసి నీటి ఎద్దడిని నివారించాలని సూచించారని తెలిపారు. తాగునీటి బోర్లు వేసేందుకు డిఎంఎఫ్ఒ నిధుల కింద రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. 15 ప్రాంతాల్లో మోటర్లు, బోర్లు, పైపులు వేసేందుకు నిధులను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాజీవ్ కాలనీలో కొత్త బోరు వేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ఎస్‌టి షరీఫ్, మహమ్మద్, మహబూబ్ షరీఫ్, వీరభద్ర, గొటూరు నాగభూషణం, వేమకుమార్, డక్కా రమేష్, గంగాధర్‌రెడ్డి, భాస్కర్, వేంకటేష్, శివ, వెంకటపతి పాల్గొన్నారు.



బోరు వేయిస్తున్న టిడిపి నేతలు

ఎంపీ నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - ఖాజీపేట

పార్లమెంట్ అంచనాల కమిటీ సభ్యునిగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎన్నిక కావడం పట్ల వైసిపి నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ పివి రాఘవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ వైసిపి రైతు విభాగం అధ్యక్షులు జి.నాగిరెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, కూనవారిపల్లి సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా తాము కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

24న ఆదరణ-3పై సమావేశం

ఖాజీపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బిసి వర్గాలకు అమలు చేయనున్న ఆదరణ-3 పథకానికి సంబంధించి సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎవి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. రజకులు, నాయి బ్రాహ్మణులు, వడ్డెర, మత్స్యకారులు, స్వర్ణకారులు, వడ్రంగి, కుమ్మరి, కల్లుగీత కార్మికులు తదితర బిసి కులాల వారు హాజరుకావాలని ఆయన కోరారు.

నక్కలదిన్నెలో ప్రత్యేక పూజలు

చాపాడు : మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో శుక్రవారం సీతారామ సమేత హనుమాన్ విగ్రహ శిఖర ప్రతిష్ఠించి 41రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేకపూజలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సిఆర్‌డిఎ కమిషనర్ రామ్‌సుందర్ రెడ్డి, ఆలయ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, నిర్వాహకులు సివి సుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని ఇడమడక చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ నారాయణ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. వాహనాల తనిఖీలో భాగంగా నారాయణ విధులు నిర్వహిస్తుండగా.. హైదరాబాదు నుంచి కడప వైపు వెళుతున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో నారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం చాగలమర్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన నారాయణ

చిన్నారిని ఢీకొన్న కారు

పరిస్థితి విషమం.. కర్నూలుకు తరలింపు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆడుకుంటూ పొరపాటున రోడ్డుపైకి వచ్చిన అభంశుభం తెలియని గోవింద్ కీర్తన అనే చిన్నారిని కారు అతివేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో పాపపైకి టైర్ ఎక్కింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పలూరు గ్రామానికి చెందిన గోవింద్ శ్యామల ప్రాథమిక పాఠశాలలో వంట మనిషిగా పని చేస్తోంది. అదే పాఠశాలలో కీర్తన 1వ తరగతి చదువుతోంది. శ్యామల బిడ్డను తీసుకుని గ్రామంలోని సచివాలయం సమీపంలో ఉన్న శివప్రసాద్ ఇంట్లో జరిగే బంధువుల శుభ కార్యానికి వెళ్లింది. చిన్నారి రోడ్డుపై ఆడుకుంటుండగా కొలవలి గ్రామానికి చెందిన డ్రైవర్ కొండయ్య కారు నిర్లక్ష్యంగా నడపడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో పాప తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చిన్నారి తండ్రి గోవింద్ లక్ష్మయ్య ఏడాది క్రితం పాము కాటుకు గురై మృతి చెందాడు.



గాయపడిన కీర్తన

కొండలు మాయం.. పట్టని అధికారులు..!



మట్టిని తవ్వుతున్న జెసిబి యంత్రం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని రేకులకుంట, పలుగురాళ్లపల్లి రెవెన్యూ పొలాల్లో బడా కంపెనీ కాంట్రాక్టర్లు కొండలను పిండి చేస్తున్నా.. రెవెన్యూ అధికారులు అటువైపు చూసిన పాపాన పోలేదు. ధనవంతులు, రాజకీయ బలం కలిగిన బడా నేతలు కొండలు తవ్వినా, భూములు ఆక్రమించినా చట్టాలు వర్తించడం లేదు. సామాన్య పేద ప్రజలు ఒక ట్రాక్టర్ మట్టి తోలితే ఆగమేఘాల మీద రెవెన్యూ అధికారులు అడ్డుకొని వాహనాలు సీజ్ చేస్తారు. ప్రస్తుతం కొండలను తవ్వేస్తున్నా రెవెన్యూ యంత్రాంగం నిద్రపోతుందా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చట్టాలు పేదలకు ఒక లెక్క, పెద్దలకు ఒక లెక్కగా వర్తిస్తాయా అంటూ ప్రశ్నిస్తున్నారు. మండలంలో హైవే పనుల కోసం కొండలు తవ్విన ప్రాంతాల్లో జిల్లా అధికార యంత్రాంగం పరిశీలించి, అనుమతులు లేకుండా మట్టి తోలిన కొండలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. మండలంలో పెద్ద ఎత్తున మట్టి తోలకాలు జరుగుతున్నప్పటికీ నిద్రమత్తులో ఉన్న రెవెన్యూ యంత్రాంగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పలుగురాళ్లపల్లి, రేకులకుంట ప్రాంతాల్లో ప్రభుత్వానికి రాయల్టీ కట్టకుండా రెవెన్యూ అనుమతులు తీసుకోకుండా, అక్రమంగా కొండలు తవ్వి మట్టి తరలిస్తున్నారు. మండలస్థాయి రెవెన్యూ అధికారులు రెండుసార్లు జరిమానా వేసినప్పటికీ.. దమ్ముంటే పట్టుకో.. చూద్దామంటూ రెవెన్యూ అధికారులకు సవాలు విసురుతున్నారు. మండలస్థాయి అధికారులు సైతం పెద్దవారితో పెట్టుకుంటే వారి స్థానాలు తారుమారవుతాయని హడలిపోతున్నారు. అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా మట్టి తవ్వడం ప్రభుత్వానికి నష్టమే కదా మరి అధికార యంత్రాంగం ఎందుకు వీటిపైన చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.



మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్

ప్రీ స్కూల్‌లో నాణ్యతాప్రమాణాలు పెంచాలి



అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ

ప్రజాశక్తి - చాపాడు

అంగన్వాడీ స్థాయిలోనే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలు పెంచే ఆధార్ శీలా, నవ చేతన్‌పై చాపాడు సెక్టర్ సిడిపిఒ సావిత్రమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోషన్ భీ పఢాయ్ భీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు స్థానిక కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ విద్యార్థుల్లో నాణ్యత ప్రమాణాలు పెంపొందించేందుకు కార్యకర్తలకు శిక్షణ ఇప్పిస్తోందన్నారు. 0-3 సంవత్సరాల పిల్లలకు ఆధార్ నవ చేతన, 3-6 సంవత్సరాలలోపు వారికి ఆధార్ శీలా పేరుతో కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు భోజన వసతి, ప్రతిరోజు రూ.150 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. చాపాడు, దువ్వూరు మండలాల కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. బ్రహ్మంగారిమఠం మండల కార్యకర్తలకు రెండవ దఫా శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, సౌజన్య, ప్రత్యూష, శారదమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేట : అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని, అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ.. పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా జరగనున్న శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం పౌష్టికాహార ఆవశ్యకత గురించి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తుండడంతోపాటు పూర్వ ప్రాథమిక విద్యను నాణ్యతతో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి, జహరాబి, రమాదేవి, ప్రదమ్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ నరసింహులు పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రతను కాపాడుతాం

ప్రజాశక్తి - వేముల

ఉద్యోగులు, కార్యాలయ భద్రతను కాపాడుతామని యుసిఐఎల్ జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్ తెలిపారు. తుమ్మలపల్లె యుసిఐఎల్‌లో శుక్రవారం 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎం.శివ కుమార్, జనరల్ మేనేజర్ (మిల్లు) సుమన్ సర్కార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలను పాటిస్తామని, వృత్తిపరమైన ప్రమాదాలను నివారించే అలవాట్లను పెంపొందించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. సుమన్ సర్కార్ మాట్లాడుతూ నిరంతర భద్రత మెరుగుదల ప్రాముఖ్యతను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. భద్రత కేవలం ఒక విధానం కాదు-ఇది ఒక బాధ్యత అన్నారు. ప్రమాద రహిత పని వాతావరణాన్ని నిర్ధారించడానికి ప్రతి ఉద్యోగి తమ రోజువారీ పనులలో భద్రతను ఏకీకృతం చేయాలని సూచించారు. భద్రత వారోత్స వాల్లో వివిధ భాషల్లో వ్యాస రచనలు, నినాదాల పోటీలు, పోస్టర్ తయారీ, భద్రత క్విజ్‌తో సహా వివిధ పోటీలను నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అభిజ్ఞాన్, వాసుదేవ్‌రెడ్డి, గౌతమ్ కె.మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్, విలియం క్యారీ పాల్గొన్నారు.



భద్రత వారోత్సవాల్లో పాల్గొన్న యుసిఐఎల్ అధికారులు



మొక్కలు నాటుతున్న తులసిరెడ్డి, నాయకులు

మానవ మనుగడకు చెట్లే ప్రధానం

ప్రజాశక్తి - వేంపల్లె

అడవులు, చెట్లు లేకపోతే మానవ జాతి మనుగడే లేదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు తులసిరెడ్డి, పులివెందుల సమన్వయకర్త ధృవకుమార్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ అడవులు, చెట్ల ప్రాముఖ్యతను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడమే ప్రపంచ అటవీ దినోత్సవమన్నారు. అడవులు మానవునికి పలు రకాలుగా ఉపయోగపడుతున్నాయన్నారు. భారతీయ నాగరికత అడవుల్లోనే పుట్టిందని తెలిపారు. మొత్తం భూ భాగంలో 33 శాతం అడవులు ఉండాలని, మన దేశంలో కేవలం 19 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. అడవుల విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమం, చెట్లను రక్షించే కార్యక్రమం పవిత్రంగా భావించాలని కాంగ్రెస్ శ్రేణులకు తులసిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లె, వేముల మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, వెంకటేష్, ఉత్తన్న, బద్రి, సాయి, విజయ్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి పురస్కరించుకొని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వా సుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదానం శిబిరం విజయవంతమైందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. మెగా రక్తదాన శిబిరానికి మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ యువత రక్తదానం చేయడంలో ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆపద సమయంలో ఇలాంటి రక్తదాన శిబిరాల ద్వారా రక్తం సరైన సమయంలో అంది వారి ప్రాణాపాయ పరిస్థితి నుండి తప్పించవచ్చని తెలిపారు. మరోకరి ప్రాణం కాపాడవచ్చన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ వారికి అభినందనలు తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి దేశ స్వాతంత్రం కోసం వీరమరణం పొందిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ నేటి యువతకు ఆదర్శమూర్తులన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు సుబహన్, సహాయ కార్యదర్శి మహేష్, సభ్యులు నాగరాజు, జగన్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

విభిన్నప్రతిభావంతులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రంజాన్ మాసంలో ఉపవాసాల ద్వారా ఆకలిబాధలు తెలుస్తాయని, ప్రతి ముస్లిం తాను సంపాదించిన మొత్తంలో కొంతభాగాన్ని పలు సేవా కార్యక్రమాలను చేయూతనిస్తారని విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఎస్బిఎస్ హోమ్ నీడ్స్ యజమాని మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో వారి కుమారుడు మహమ్మద్ తౌఫిక్ అలీ చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్బిఎస్ మహమ్మద్ అలీ సేవా స్ఫూర్తిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో తౌఫిక్ అలీ, రేవంత్, విభిన్నప్రతిభావంతుల సంఘ సభ్యులు గంగయ్య, మహమ్మద్ వలి, బాషా, పఠాన్, హుసేన్ ఖాన్ పాల్గొన్నారు.



దుస్తులు అందిస్తున్న అలీ

అక్రమ మైనింగ్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

తహశీల్దార్‌ను కోరిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - వేముల

మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ ఎం.ఇందిరా రాణిని ఆయనతోపాటు మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్ కలిశారు. ఈ సందర్భంగా వారు ఆక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్ తవ్వకాల వల్ల చాలామంది కూలీల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ అనుమతితో ఉన్న వాటికి పనులు చేసుకోనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా మైనింగ్ చేయడం వల్ల గొర్రె కాపరులు కూడా నష్టం జరుగుతుందన్నారు. ఎక్కడ పడితే అక్కడ మైనింగ్ పనులు చేపట్టడం వల్ల ఇటీవల చిట్టిబోయిన రామచంద్ర అనే కూలీ మృతి చెందాడని గుర్తు చేశారు. పలు సమస్యలను తహశీల్దార్ దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన తహశీల్దారు ఇందిరా రాణి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డికెటి పట్టాలు, అక్రమ మైనింగ్ తవ్వకాలపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సత్యనారాయణ

రూ. 26 వేలు వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు రూ.26వేలు వేతనాలివ్వాలని శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో కోరారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 టెండర్లు ద్వారా పిలిచి వారికి కెప్టెన్లు అని పేరు పెట్టి వారితో డ్రైవర్ పని చేయించుకుంటూ రూ.7,800 జీతాలు ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకోవడం తగదన్నారు. రేపు జరిగే టెండర్లలో డ్రైవర్ల జీతాలను దృష్టిలో పెట్టుకొని రూ.26వేలు వేతనాలు సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం ఇవ్వాలన్నారు. ఆ రకంగా టెండర్లు వేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. చాలీచాలని జీతంతో వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్యూటీలో ఏదైనా ప్రమాదాలు జరిగితే వారిని ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాఘవ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ రాష్ట్ర సెక్రెటరీ హరికృష్ణ, జిల్లా అధ్యక్షులు సోము మహేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు.. విద్యార్థులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ నియమ నిబంధనలను ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఏమాత్రం అనుసరించడం లేదు. ప్రయివేట్ పాఠశాలల పట్ల విద్యా శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకెళ్తే.. వేసవి దృష్ట్యా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ప్రభుత్వం అన్ని పాఠశాలల విద్యార్థులకు ఒక్క పూట తరగతులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధనలు ఖాజీపేట మండలంలో ఏ మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. ప్రత్యేక తరగతుల పేరిట విద్యార్థులకు మధ్యాహ్నం సైతం తరగతులు నిర్వహిస్తూ ఇక్కట్లకు గురి చేస్తున్నారు. ఎండల తీవ్రతతో విద్యార్థులు ప్రత్యేక తరగతులకు వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉక్కపోతతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో శుక్రవారం ఇంపాక్ట్ ఫౌండర్ డాక్టర్ గంపా నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా ఇంపాక్ట్ విషెడోమ్ క్లబ్ బృందం స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తం చాలా అవసరమన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని యువకులు రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానం చేసిన యువకులను ఆయన ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇంపాక్ట్ విషెడోమ్ క్లబ్ ట్రైనర్ రమేష్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.



సామగ్రిని అందజేస్తున్న ఖలీల్ సౌదాగర్

అంధుల ఆశ్రమానికి ఎస్ఎంఎస్ చేయూత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీనివాస హాల్ సమీపంలో ఉన్న వీర నారాయణస్వామి అంధుల ఆశ్రమానికి శుక్రవారం ఎస్ఎంఎస్ చేయూతను అందించింది. ఎస్ఎంఎస్ కంపెనీ ఆధ్వర్యంలో ఎస్ఎంఎస్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఖలీల్ సౌదాగర్ ఆధ్వర్యంలో ఆశ్రమానికి మంచాలు, బియ్యం ప్యాకెట్లు, దుప్పట్లు, చీరలు, టీ షర్టు, ప్యాంట్లు అవసరమైన సామగ్రి అందజేశారు. ఆశ్రమంలో వృద్ధులు కూర్చునేందుకు బల్లలు, సుమారు రూ.2లక్షలు విలువ చేసే వస్తువులను ఆశ్రమానికి వితరణ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ విజిలెన్స్ అధికారి ఖలీల్ సౌధాగర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఎస్ఎంఎస్ ఆధ్వర్యంలో వృద్ధుల, అనాథాశ్రమాలకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్నామన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకొని తమకు తోచిన విధంగా సహాయం అందించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ఎస్ఎంఎస్ కంపెనీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ నరసింహులు, ఎస్ఎంఎస్ కంపెనీ జిఎం హెచ్ఆర్ నిషికాంత్ బోరే, నరేష్ నాగపూరే, డిప్యూటీ మేనేజర్ పవన్‌కుమార్‌రెడ్డి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేష్ కుమార్‌రెడ్డి, అంకాలమ్మ ఆలయ చైర్మన్ ప్రసాద్, సీనియర్ పాత్రికేయుడు రంగనాయకులు, ఆశ్రమం నిర్వాహకులు రామ్మోహన్ పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

ప్రజాశక్తి - వేంపల్లె

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. శుక్రవారం ప్లాస్టిక్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవన విధానం ప్లాస్టిక్ వస్తువుల ద్వారా మార్పులు వస్తున్నట్లు చెప్పారు. వైజ్ఞానిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల ఫలితంగా ప్లాస్టిక్ వస్తువుల నుంచి నష్టాలు అధికంగా ఉంటాయన్నారు. దుష్ఫలితాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెక్కభజన, కళా నృత్యాల ద్వారా ప్లాస్టిక్ వస్తువులతో కలిగే అనర్థాలపై ప్రజల్లో కవి డ్యాన్స్ అకాడమీ అవగాహన కల్పిస్తున్నట్లు రిటైర్డ్ టీచర్ కవి ప్రసాద్ తెలిపారు. కళల ద్వారా అవగాహన కల్పించిన విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ సి.మల్లేశ్వరమ్మ, లైబ్రేరియన్ మాధవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్, సిబ్బంది